తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 184 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | సోమవారం 09 డిసెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-





అంబరాన్నంటిన ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

## ఆకట్టుకున్న సంగీత కార్యక్రమం

- ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎయిర్ షో
- సంగీత కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

శాసనసభ / హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో ప్రజాపాలన విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐమాక్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసినటువంటి సంగీత కార్యక్రమం సంగీత అభిమానుల కేరింతల మధ్య జరిగింది. ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పాడిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్,కోమటి రెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

మిగతా »»4లో

### రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి
## తగినంత సమయం ఇచ్చినాం
### ఇంకా మనం మాట్లాడకుంటే
## మంచిదికాదు



- రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందింది
- రాష్ట్రంలోని గురుకుల విద్య రోజు రోజుకూ దిగజారుతున్నదని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గొంతు విప్పాలని, పార్టీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.



శాసనసభ / హైదరాబాద్ : అధికారం లోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామని, ప్రభుత్వ చేతకాని తనం వల్ల అస్తవ్యస్తంగా మారిన పాలనకు విసుగుచెందిన రాష్ట్ర ప్రజలు తిరగబడుతున్న నేపథ్యంలో, తెలంగాణను తెచ్చి పదేండ్లు ప్రగతి పథాన నిలిపిన పార్టీగా, ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎక్కడికక్కడ ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరులను నిలదీయాలని, అందుకు సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీని వేదికగా చేసుకుని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గొంతు విప్పాలని, పార్టీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

మిగతా »»4లో

### రేవంత్ ఏడాది పాలనపై
## చార్జిషీట్ విడుదల చేసిన హరీశ్ రావు



- తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి
- విజయోత్సవాలు చేసుకుంటున్న కాంగ్రెస్
- చార్జిషీట్లు విడుదల చేస్తున్న బీఆర్ఎస్,బీజేపీ

శాసనసభ / హైదరాబాద్ : నేడు చార్జిషీట్ విడుదల చేసి ప్రభుత్వాన్ని ఏకిపారేసిన హరీశ్ రావు తమ ఏడాది పాలనపై ఓవైపు అధికార కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకుంటుంటే విపక్ష బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ చార్జిషీట్లు విడుదల చేస్తున్నాయి. తాజాగా, బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు కూడా రేవంత్ ఏడాది పాలనపై చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

మిగతా »»4లో

### రైతుల కోసం
## ధరణి కొత్త యాప్,కొత్త చట్టం




శాసనసభ / హైదరాబాద్ : కమిటీ నివేదిక ఆధారంగా ధరణి పోర్టల్‌ను ఎలా ప్రక్షాళన చేయాలో చూస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.రైతులకు మంచి జరిగే ప్రతి సూచననూ స్వీకరిస్తామన్నారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు " మా ప్రభుత్వం వచ్చాక ధరణిలో కొన్ని మార్పులు చేశాం. పోర్టల్ నిర్వహణను ఈ నెల ఒకటో తేదీ నుంచి విదేశీ సంస్థ నుంచి ఎన్ఐసీకి మార్చాం.2020 ఆర్‌వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్‌వోఆర్ చట్టం తెస్తున్నాం. కొత్త చట్టాన్ని రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేస్తాం. ధరణి కొత్త యాప్,కొత్త చట్టం సామాన్య ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది"అని అన్నారు.గత ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందని,కానీ రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలని స్థానికులు కోరుకుంటున్నారని చెప్పారు.

మిగతా »»4లో

### విగ్రహావిష్కరణకు రాలేను..
### మంత్రి పొన్నంకు సెంట్రల్ మినిస్టర్
## కిషన్ రెడ్డి లేఖ..



శాసనసభ / హైదరాబాద్ : డిసెంబర్ 9 సోమవారం తెలంగాణ సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అందరికీ ఆహ్వాన పత్రికలు పంపింది.ప్రభుత్వం తరపున పొన్నం ప్రభాకర్ గౌడ్ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమానికి రావాల్సిందిగా కోరారు.

మిగతా »»4లో

### రైతుల తరపున అసెంబ్లీలో
## ప్రభుత్వాన్ని నిలదీస్తాం



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చే ప్రభుత్వం నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.తెలంగాణ ఉద్యమ చరిత్ర, అస్థిత్వంపై అవగాహన లేకుండా, బాధ్యతారా హిత్యంగా వ్యవహరిస్తోందని ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.ఈ చర్య తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరు స్తుందని,ప్రజల ఆవేదనకు బీఆర్ఎస్ గొంతుకగా నిలుస్తుందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గాలను శాసనసభ, మండలి లో నిలదీస్తామని కేటీఆర్ ప్రకటించారు. గ్రామ పంచాయతీలలో నిధుల కొరతను ప్రశ్నిస్తూ, సర్పంచు లు, మాజీ సర్పంచులకు బిల్లుల చెల్లింపులు జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ప్రగతి ద్వారా దేశంలో అత్యుత్తమ గ్రామాలుగా తెలంగాణ గ్రామాలు నిలిచినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు పల్లెల అభివృద్ధిని దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు.దళితబంధు కార్యక్రమం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అందుకు చెల్లింపులు జరగలేదని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే, రైతుబంధు రెండో విడత నిధుల విడుదల ఆలస్యం రైతుల కష్టాలను పెంచిందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 420 హామీలు పెట్టి ప్రజలను మోసగించిందని విమర్శించారు. బీసీలకు 42% రిజర్వేషన్లు, లక్ష కోట్ల బడ్జెట్ వంటి హామీలను అమలు చేయలేదని, అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నట్టేనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రతి హామీపై బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని, ప్రజల సమస్యలపై శాసనసభ, మండలిలో బలమైన గొంతు వినిపిస్తామని హామీ ఇచ్చారు. ఎల్పీ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ ప్రత్యేకంగా దిశానిర్దేశం ఇచ్చారని, రాష్ట్ర ప్రజల ఆవేదనను ప్రభుత్వానికి ముక్కుసూటిగా వ్యక్తపరచేందుకు ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### టీ ఫైబర్,మీ సేవ
## యాప్ సేవలు ప్రారంభం

మిగతా »»4లో




### గురుకులాలపై సమీక్షించిన మంత్రి పొన్నం..
## కీలక ఆదేశాలు



శాసనసభ / హైదరాబాద్ : మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల పై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సమావేశంలో ఏంజెపి గురుకుల సెక్రటరీ సైదులు , ఆర్సీవో లు, డిసిఓలు , ప్రిన్సిపల్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ఆహారంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏదైనా స్కూల్లో సమస్యలు ఉంటే వెంటనే సెక్రటరీకి తెలియజేస్తే సెక్రెటరీ ద్వారా ప్రభుత్వానికి

మిగతా »»4లో

### స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి
## 750కోట్లు నిధులు
## సీఎం కేటాయించారు



శాసనసభ / హైదరాబాద్ : వరంగల్ జిల్లా మడికొండ సత్యసాయి గార్డెన్ లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజాపాలన విజయోత్సవ సభకు అధ్యక్షత వహించారు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యలు హజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. 15సంవత్సరాలుగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం వెనుకబడిందని దానిని దృష్టిలో పెట్టుకొని ఈసారి నన్ను గెలిపించాలని కోరానని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత స్టేషన్ ఘనపూర్ మళ్ళీ అభివృద్ధి జరగదని నేను అనుకుంటే నాకు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కి రావాలని కోరారన్నారు.

మిగతా »»4లో

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

### ఇందిరమ్మ కమిటీ సభ్యులు,పార్టీ కార్యకర్తలతోసమావేశం

### మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్కు నరసింహ



**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 08) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం చాలా సంతోషకరమని యాచారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్కు నరసింహ అన్నారు. ఆదివారం యాచారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేటి నుండి ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు గ్రామపంచాయతీ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పేద ప్రజలకు దగ్గరుండి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు . 6 గ్యారంటీలో ఉచిత బస్సు, ఉచిత కరెంటు, మహిళలకు గ్యాస్, ఇందిరమ్మ ఇండ్లు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇండ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతల మాటలు నమ్మొద్దని అన్నారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిన్నోళ్ల మల్లేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నీలం వెంకటేష్, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు తోడ్పడడం మన భాద్యత

- తులేకలాన్ లో ఉచిత బస్సు పాసులు అందజేత
- మండల BRS పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు.




**ఇబ్రహీంపట్నం,శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 8 :** దివ్యాంగులకు అండగా నిలబడడం సామాజిక భాద్యతగా మనందరం గుర్తెరగాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి సహకారంతో ఆర్టీసీ -2 డిపో అధికారులు తులేకలాన్ గ్రామానికి చెందిన 60 మంది దివ్యాంగులకు జారీ చేసిన ఉచిత బస్ పాస్ లను గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కొద్దిపాటి సహకారాన్ని అందిస్తే దివ్యాంగులు స్వతంత్రంగా ఎదుగుతారని,తమ కాళ్లపై తాము నిలబడుతారని అన్నారు. గ్రామానికొకరు చొప్పున దాతలు ముందుకొచ్చి దివ్యాంగుల ఉచిత బస్ పాస్ లకు ఇతోధికంగా సహాయపడడం అభినందనీయమన్నారు.గ్రామ మాజీ సర్పంచ్ కొంగర బీరప్ప,ఆర్టీసీ అధికారులు శివరాజ్ గౌడ్,నాయిని అంజయ్య,గ్రామ శాఖ అధ్యక్షుడు గుజ్జ యాదగిరి, నాయకులు సామ జంగారెడ్డి , ఆంజనేయులు , జక్కుల వెంకటేష్ , చేగూరి ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంతు ఎలక్ట్రానిక్ మొబైల్ ఫర్నీచర్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**కొండమల్లేపల్లి, శాసనసభ న్యూస్ డిసెంబర్ 8 :** కొండమల్లేపల్లిమండల కేంద్రంలో సంతు ఎలక్ట్రానిక్ మొబైల్ ఫర్నీచర్ షాప్ ను పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించి, షాప్ యజమాని సంతుకి శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్,మండల ఎంపీపీ దూధిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, పిఎసిఎస్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్,మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి, బద్య నాయక్,మాజి వైస్ ఎంపీపీ కాసార్ల వేంకటేశ్వర్లు, మాజి జడ్పీటిసి సలహాదారుడు యుగంధర్ రెడ్డి,యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి, బొడ్డుపల్లి సైదులు, సుధాకర్,మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి,మాజి ఎంపీపీలు సర్వయ్య యాదవ్,బిక్కు నాయక్, గోవింద్ యాదవ్, ఉప సర్పంచ్ గంధం సురేష్,వాస్కుల బక్కలయ్య,యువ నాయకులు బాబు రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 10న చలో ఇబ్రహీంపట్నం గోడపత్రిక విడుదల

### వేదిక: శాస్త్ర గార్డెన్,మధ్యాహ్నం 12 గంటలకు వేలాదిమంది మాదిగలు తరలి రావాలి

### బండి మీద కృష్ణ మాదిగ పిలుపు





**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 08):** డిసెంబర్ వదిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి వేలాదిమంది మాదిగలు సభకు తరలి రావాలని బండి మీద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం యాచారం, మాల్ , అంబేద్కర్ చౌరస్తాలలో బండిమీద కృష్ణ, ఎమ్మెస్ పి, మండల అధ్యక్షుడు బోడ ముత్యాలు, చిన్నోళ్ల జాంగిర్ వివిధ గ్రామాలలో ఎమ్మార్పీఎస్ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించండి. అన్నదమ్ముల్లాగా ఏబిసిడి వర్గీకరణ అంశాలపై సమీక్ష చేసుకుందామని ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడారు. అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్ ఫలాలు మాదిగ, ఉప కులాలకు అందాలని అన్నారు. ఎస్సీ సామాజిక వర్గం చెందిన ప్రతి ఒక్కరికి రిజర్వేషన్ ఫలాలు అందాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కొనసాగుతున్న రాష్ట్రాలలో ఏబిసిడి వర్గీకరణకు మాలలు అడ్డుపడటం మాలలపై విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ, ప్రొఫెసర్ కసిమ్ హాజరవుతున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు సమయానికి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మూలిమహేష్, ప్రధాన కార్యదర్శి మస్కు శ్రీనివాస్, మస్కు అబ్బయ్య, జోగు అంజయ్య, మస్కు మహేందర్, యాచారం గ్రామ శాఖ అధ్యక్షుడు మస్కు మహేందర్, పార సంజీవ, మస్కు నవీన్, అనిల్ కుమార్, మస్కు శివశరణం, గోల్కొండ ప్రసాద్, జోగు శేఖర్, మస్కు రమేష్, జోగు కృష్ణ, ఎలిమినేటి చందు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న బాల్యమిత్రులు

- మానవత్వం చాటుకున్న గురు శిష్యులు
- తోటి స్నేహితులకు ఆపద వస్తే ఆదుకోండి
- ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూర్ డిసెంబర్ 8 (శాసనసభ న్యూస్) :** చండూరు గాంధీజీ పాఠశాలలో చదువుకున్న బాల్యమిత్రులు (2011-12,10వ తరగతి బ్యాచ్). బాల్య మిత్రులలో ఒక అమ్మాయి భర్త ఇటీవల మరణించడం, ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో దుఃఖంలో మునిగారు. ఏ విధంగానైనా తమ స్నేహితురాలు దోమలపల్లి జ్ఞానేశ్వరికి సహాయపడాలనే ఆలోచన వచ్చింది, వచ్చిందే తడవుగా అందరూ కొన్ని డబ్బులను పోగు చేసారు,87,000 రూపాయలు అయ్యాయి. వీటన్నింటిని తీసుకొని తమ గురువు అయిన గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు దగ్గరకు వెళ్లి విషయం తెలుపగా,తాను తన గాంధీజీ ఫౌండేషన్ ద్వారా 20వేల రూపాయలను కలిపి 1,00,000 రూపాయలను జ్ఞానేశ్వరి ఇద్దరు కుమార్తెల పేరు మీదుగా బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేద్దామని నిర్ణయించి, ఆదివారం నాడు గాంధీజీ విద్యాసంస్థల యందు 1,00,000 రూపాయల చెక్కును,7,000 రూపాయల నగదును గురుశిష్యులందరు కలిసి దోమలపల్లి జ్ఞానేశ్వర్ కి అందించారు.ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థలు, గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ గాంధీజీ విద్యాసంస్థల పూర్వ



విద్యార్థులు మానవత్వం చాటుకున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకొని బాల్యంలో కలిసి చదువుకున్న స్నేహితులలో ఎవరికైనా ఆపద వస్తే ఆదుకోవాలని, దానికి ఎప్పుడూ నేను ముందుంటానని అన్నారు. దోమలపల్లి జ్ఞానేశ్వరి ఇద్దరు పిల్లలను పదవ తరగతి వరకు మా గాంధీజీ ఫౌండేషన్ ఉచితంగా చదివిస్తుందని, ఆమె ధైర్యంగా జీవించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, మాదగోని స్వామి, పులకరం వెంకన్న, సోము రవికుమార్, మన్నెం ప్రవీణ్, గురిజ శివ, బొమ్మరగోని ఉదయ్, విష్ణువర్ధన్ రెడ్డి, నాంపల్లి అశోక్, ఎర్రజెల్ల అనిల్, బోడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్న

### ఏమి సాధించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు

**చండూర్ (చౌటుప్పల్) డిసెంబర్ 8 (శాసనసభ న్యూస్) :** చౌటుప్పల్ లో కందాల రంగారెడ్డి స్మారక భవనంలో మీడియా సమావేశంలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడు తూ రైతంగం విషయంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా,గిట్టుబాటు ధర,బోనస్ విషయంలో రైతులు ఆందోళన గురవుతా ఉన్నారని అన్నారు.ఇంతవరకు ధరణి సమస్య పరిష్కారం కాలేదని అన్నారు.మహిళలకు 2500, సిలిండర్ సబ్సిడీ పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని అన్నారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తే వాళ్లకు పట్టిన గతే వీళ్లకు పడుతుందని అన్నారు.కేంద్రంలో నున్న బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారులకు వచ్చిన తర్వాత ప్రభుత్వంలోని అన్ని రంగాలను ధ్వంసం చేస్తుందని ప్రజల మధ్యన మత విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ జిల్లా మహాసభలు చౌటుప్పల్ ఉద్యమ కేంద్రంగా జరుగుతా ఉన్నాయని ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ, ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసుకొని ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు.కమ్యూనిస్టుల పోరాటాల ద్వారానే అసమనతో




లేని సమాజం వస్తుందని అని అన్నారు.ఈ నెల డిసెంబర్ 15న చౌటుప్పల్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని డిసెంబర్ 16 17 తేదీలలో ప్రతినిధుల సభ ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎమ్ డి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండి పాషా, బండారు నరసింహ, సిపిఎం నాయకులు పల్లె మధు కృష్ణ, రాగిరి కిష్టయ్య, బొజ్జ బాలయ్య, ఆదిమూలం నందీశ్వర్,బోయ యాదయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ ఆత్మను దెబ్బతీయాలని చూస్తున్న రేవంత్: దాసోజు శ్రవణ్



**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ తల్లి విగ్రహం అంటే కేవలం శిల్పం కాదు.. అది ఉద్యమ చరిత్ర, ఆత్మ గౌరవానికి నిదర్శనం అని ప్రొఫెసర్ దాసోజు శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. 'విగ్రహ మార్పు ద్వారా ఉద్యమ ఆత్మను దెబ్బతీయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి చర్యను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అనేది చరిత్రను అపహాస్యం చేయడమే. రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ చిల్లర నిర్ణయాలను సహించబోమని ప్రజలు స్పష్టంగా చెప్పాలి.' అని ఆయన అన్నారు.

## ప్రభుత్వ పాఠశాల నుండి మట్టి అక్రమంగా తరలింపు





**చండూర్ డిసెంబర్ 8 (శాసనసభ న్యూస్) :** ఆదివారం చండూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో భారీ నిర్మాణాలు చేపట్టొద్దన్న నిబంధనను బేఖాతరు చేస్తూ ఇటీవల కాలంలో చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భారీ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు.నిర్మాణంలో భాగంగా భారీగా బయట కు తీసిన మట్టిని అక్రమంగా బయటకు తరలిస్తూ పాఠశాల ఆవరణలోని మట్టిని బయట అమ్ముతూ డబ్బును సొమ్ము చేసుకుంటున్నారు. చినుకు పడితే చెరువుల తలపిస్తున్న పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఆ మట్టిని పోయకుండా బయటకు తరలించడం అన్యాయమని,ఆ అక్రమ తరలింపును వెంటనే ఆపాలని, ఏఐఎస్ఎఫ్ చండూరు మండల ప్రధాన కార్యదర్శి కురుపాటి పరమేష్ డిమాండ్ చేశారు.

## పశు వైద్య వాహనం షెడ్డుకే పరిమితం అయ్యింది : కాసాల



**చండూర్ డిసెంబర్ 8 (శాసనసభ న్యూస్) :** మూగజీవాలకు వైద్యం అందించే 1962 గల పశు వైద్య వాహనం మరమ్మత్తుల పేరిట నెల రోజులకు పైబడి షెడ్డుకే పరిమితం అయిందని,దీంతో మూగజీవాల కు వైద్య సదుపాయం కరువైందని భారతీయ జనతా కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆపద సమయంలో మూగ జీవాలను ఆదుకోవడం కోసమై ఏర్పాటు చేసిన పశువైద్య వాహనం మునుగోడు నియోజకవర్గ రైతులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పశువైద్య వాహనం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## రావిరాల చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**ఆదిభట్ల, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 8 :** ఆదిబట్ల పోలీసు స్టేషన్ పరిధి మహేశ్వరం మండలం, రవిరాల గ్రామం చెరువు లో ఆదివారం నాడు ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి శవం లభ్యం అయింది. శవాన్ని పరిశీలించగా అతని వయస్సు అందాజ 20-25 వరకు కలిగి ఉండి 5.7 అడుగుల ఎత్తు, తెలుపు రంగు లో ఉన్నాడు. అతను ధరించిన దుస్తులు: నలుపు, తెలుపు రంగులో ఉన్న 3/4 షార్ట్, ముదురు ఆకుపచ్చ టిషర్ట్. కుడి చేయి మీద "అ" అక్షరం పచ్చబొట్టు కలదు. నాలుగు రోజులు కిందట మరణించినట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.ఈ వ్యక్తి ఆనవాలు ఎవరికైనా తెలిసి ఉంటే ఈ కింది నంబర్లకు సంప్రదించగలరని ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.సెల్: 8712662671, 8712662364, 8712662383.

## ముఖ్యమంత్రి సభలో దొంగల చేతివాటం



**శాసనసభ / హైదరాబాద్ :** నల్గొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సభలో దొంగల చేతివాటం చూపించారు. శనివారం ఎల్లమ్మగూడెం నుంచి వచ్చిన మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెల తాడు దొంగలు లాక్కెళ్లారు.ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి వెళ్లగా ఆదివారం తన కార్యాలయంలో ఆయన సానుకూలంగా స్పందించి బాధిత మహిళకు మూడున్నర తులాల బంగారాన్ని వారికి అందించారు. బాధిత మహిళలు సంతోషంతో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

శాసనసభ
సోమవారం 09 డిసెంబర్ - 2024

# అయ్యప్ప స్వామి శరణు ఘోషతో మారుమ్రోగిన చింతపల్లి సాయి సుమంగళి గార్డెన్స్ ప్రాంగణం

- సత్యనారాయణ అయ్యప్పగురు స్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహణ.
- శాస్త్రోక్తంగా అయ్యప్ప పూజ, అభిషేక కార్యక్రమాలు.
- స్వామివారికి 108 కలశాలతో ప్రత్యేక పూజలు.
- గురుస్వాములకు పాదపూజ, సన్మానం.
- మహా పడిపూజను విజయవంతం చేసిన ప్రతి భక్తునికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన గోవిందు యాదగిరి గురు స్వామి.











**చింతపల్లి,శాసనసభ న్యూస్( నెట్వర్క్ ఇంచార్జ్ పి వెంకటేష్) డిసెంబర్ 8 :** స్వామియే శరణమయ్యప్ప.. హరి హరి వాసనే..శరణమయ్యప్ప అంటూ వేలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్స్ లో జరిగిన అయ్యప్ప మహా పడిపూజ ప్రాంగణమంతా మార్మోగింది.శ్రీ సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో పదునెట్టాం బండిపై దీపాలు వెలిగించారు. గణపతి హెూమం తో ప్రారంభమై, శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహానికి నియమంతో పాలాభిషేకం, నెయ్యాభిషేకం,తదితర అభిషేకాలు, పూలతో పూజలు నిర్వహించారు.గోవిందు యాదగిరి,అయ్యప్ప స్వామి 18వ సంవత్సరం దీక్షలో కొనసాగుతున్న సందర్భంగా గురుస్వాములచే శాస్త్రోక్తంగా మహా పడిపూజలో భాగంగా తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈసందర్భంగా.. 108 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకించారు. అయ్యప్ప స్వామి భజన పాటలతో అక్కడి ప్రాంగణం స్వామివారి నామస్మరణతో మారుమ్రోగింది. వివిధ వేషధారణలో దేవత మూర్తులు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సుమారు 3000 మంది భక్తులు కార్యక్రమానికి హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కీ.శే ఎట్టయ్య అయ్యప్ప గురు స్వామిపై గోవిందు యాదగిరి రచించి ఆలపించి, రికార్డ్ చేసిన రెండు వీడియో పాటలను ప్రదర్శించి, అయ్యప్ప భక్తి గీతాల సిడిని గురు స్వాముల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం గోవిందు యాదగిరి స్వామి బావగారైన భోగరాజు మధు అయ్యప్ప స్వామి స్వర్ణ కంకణాన్ని అలంకరించారు. స్వామి వారికి నైవేద్యం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గోవిందు యాదగిరి అయ్యప్ప గురు స్వామి మాట్లాడుతూ 18వ మహా పడిపూజకు వివిధ ప్రాంతాల నుండి హాజరైన అయ్యప్ప గురుస్వాములకు భక్తులకు,మహిళలకు,పెద్దలకు, మహా పడిపూజ విజయవంతానికి సహకరించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# బీదర్ వెళ్లకుండా మాధవీ లత, హిందూనేతలపై నిషేధం..



**శాసనసభ / హైదరాబాద్ :** హిందూ గ్రూప్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి కర్ణాటకలోని బీదర్ జిల్లా కలెక్టర్ అనుమతి నిరాకరించారు. బీజేపీకి చెందిన తెలంగాణ నేత మాధవి లతతో పాటు ముగ్గురు వ్యక్తులు కార్యక్రమంలో పాల్గొనకుండి నిషేధించారు.కలెక్టర్ నిర్ణయాన్ని హిందూ సంఘాలు విమర్శిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ గిరీష్ బడోలే ఆదేశాల మేరకు మాధవి లత సోమవారం వరకు బీదర్‌లోకి ప్రవేశించకుండా నిషేధాన్ని విధించారు.జిల్లాలోని శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆదివారం నిర్వహించాల్సిన హిందూ గ్రూప్ సమావేశానికి కలెక్టర్ అనుమతి నిరాకరించడంతో పాటు, ఈ కార్యక్రమంలో పాల్గొనే కీలక నేతలపై నిషేధం విధించారు. బీదర్‌లోకి ప్రవేశించకుండా నిషేధించిన నాయకుల్లో మాధవి లత, శ్రీరామ్ సేన అధినేత ప్రమోద్ ముతాలిక్, హిందూత్వ కార్యకర్త కాజల్ హిందుస్తానీ ఉన్నారు. మతపరమైన ఉద్రిక్త ప్రసంగాలు చేయడంలో వీరు "అలవాటు నేరస్తులు" అని, ఇది జిల్లాలో శాంతిభద్రతల విఘాతానికి దారి తీసే అవకాశం ఉందని డిసెంబర్ 7 ఉదయం 12 గంటల నుంచి డిసెంబర్ 09 ఉదయం 6 గంటల వరకు నిషేధాన్ని విధించారు.బీదర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించిన సాయి స్కూల్ గ్రౌండ్‌లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023లోని సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144 అని పిలుస్తారు) ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడాన్ని నిషేధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కలెక్టర్, రాష్ట్రప్రభుత్వ నిర్ణయాన్ని హిందూ నేతలు ఖండించారు. ఇది హిందువుల గొంతుకను అణిచివేసే కుట్రగా విమర్శించారు.

# ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది



**శాసనసభ / హైదరాబాద్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలన విజయవంతంగా సాగిందన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. గతంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించారని, కాంగ్రెస్ మాత్రం సామాజిక తెలంగాణ దృక్పథంతో ముందుకు సాగుతుందన్నారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. ప్రస్తుత తెలంగాణ తల్లి విగ్రహం రైతు బిడ్డ రూపంలో ఉందని, తెలంగాణ తల్లి చేయి హస్తం గుర్తును చూపిస్తుందని బీఆర్ఎస్ వాళ్ళు చేస్తున్న ప్రచారం తప్పు అని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ తల్లి రవిక ఆరెంజ్, చీర ఆకుపచ్చ కలర్ ఉంది అంటే బీజేపీకి సంకేతంగా సూచిస్తుందా? ఇట్లా ఆలోచిస్తే ఎట్లా? అని ఆయన అన్నారు. గతంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించారని.. కాంగ్రెస్ మాత్రం సామాజిక తెలంగాణ దృక్పథంతో ముందుకు సాగుతుందని అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన విజయవంతంగా సాగిందని.. ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు జీవన్ రెడ్డి.

# విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

- కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ ధూళిపాల రేఖ శ్రీధర్ రెడ్డి.





**కొండమల్లేపల్లి,శాసనసభ న్యూస్ డిసెంబర్ 8 :** ఆదివారం మధ్యాహ్న సమయంలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేజీబీవి,బీసీ బాయ్స్ గురుకుల, మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ ధూళిపాల రేఖ శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మెను వివరాలు,ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల మరియు హాస్టల్ లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వంటశాల లోని,బియ్యాన్ని,సరుకులను నాణ్యతను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్లకు, ప్రిన్సిపాల్ లకు తెలియజేశారు.విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన ఆహారం అందించాలని కొండ మల్లేపల్లి మండల మాజీ అధ్యక్షురాలు (ఎంపీపీ) రేఖా శ్రీధర్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంగ్య నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అర్బన్ నక్సలైట్స్ అంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు.. సీతక్క భావోద్వేగం..



**శాసనసభ / హైదరాబాద్ :** రాష్ట్ర క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్స్ ఉన్నారని బండి సంజయ్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క భావోద్వేగానికి లోనయ్యారు. మహబూబా బాద్ లోని వ్యవసాయ మార్కెట్ లో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..అర్బన్ నక్సలైట్స్ ఉన్నారని బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా అన్నారు. నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి నన్ను అనేక విధాలుగా సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని తెలిపారు. నా మనసును నొప్పించారని మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు. నాకు చాలా బాధగా ఉందని అన్నారు.మీ నాయకులు మోడీ, అమిత్ షాలు మావోయిస్టులను జన జీవన స్రవంతిలోకి రమ్మని అంటుంటే.. మీరు మమ్మల్ని అర్బన్ నక్సలెట్స్ అనడం శోచనీయం అన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ , బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వాన్ని పడగొట్టాలనే చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సర కాలంలో ప్రభుత్వానికి ప్రజా ఆమోదం తెలిపారని అన్నారు. నేను మాత్రమే నక్సల్స్ ఉద్యమంలో పాల్గొన్న , వరంగల్ లో లాయర్ గా పనిచేసిన అన్నారు. నేను మూడు సార్లు ప్రజా ప్రతినిధిగా పనిచేసిన అన్నారు.బీజేపీ పార్టీలో ఉన్న ఈటెల రాజేందర్ ది ఏ భావజాలమో బండి సంజయ్ తెలుసుకోవాలన్నారు. బండి సంజయ్ నన్ను నేరుగా కామెంట్స్ చేయాలన్నారు. కానీ క్యాబినెట్ అందరిని అనడం సరికాదన్నారు. బీజేపీ మద్దతుతో టీడీపీ నుండి గతంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని అన్నారు. వరంగల్, కరీంనగర్ పోరాటాల గడ్డ, బండి సంజయ్ తెలుసుకోవాలన్నారు. మన వరంగల్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ బాధాకరమన్నారు. ఎన్‌కౌంటర్ లేని తెలంగాణ, శాంతి భద్రతల తెలంగాణనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సీతక్క అన్నారు.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు.. స్పీకర్ ముందస్తు సమావేశం



**శాసనసభ / హైదరాబాద్ :** ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ శాసనమండలి సమావేశాల నేపథ్యంలో ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ అధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముందస్తు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు హాజరయ్యారు. వీరితో పాటు.. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఫైనాన్స్) -రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ MA &UD-దానకిశోర్, GAD సెక్రటరీ రఘునందన్ రావు, హెూం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ- రవి గుప్తా, రాష్ట్ర DGP డాక్టర్ జితేందర్, ADG, లా& ఆర్డర్ మహేష్ భగవత్, DG ఫైర్ నాగిరెడ్డి, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు -సివి ఆనంద్, సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ IG- కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి పాల్గొన్నారు.ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ. రేపటి నుండి తెలంగాణ రాష్ట్ర శాసనసభ,శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని,గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, శాసనసభ అధికారులు,సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల హుందాతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలన్నారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలన్నారు స్పీకర్ గడ్డం ప్రసాద్. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, గత సమావేశాలకు సంబంధించిన ప్రశ్నలకు పెండింగులో ఉన్న జవాబులను వెంటనే పంపించాలన్నారు.సభలో గౌరవ సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాలకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సభకు, గౌరవ సభ్యులకు అందించాలని, సభకు సమర్పించే సమాధాన పత్రాలను ముందుగానే పంపినట్లయితే వాటిని సభ్యులు చదువుకొని సభలో మాట్లాడడానికి, చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు ఆయన.సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ బాషలలో ముద్రించి ముందస్తుగా సభ్యులకు అందించితే వారు సన్నద్ధం కావడానికి ఉపయోగపడుతుందని, శాఖకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలన్నారు. సమావేశాలు జరిగినన్ని రోజులు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలి. ప్రతి శాఖ తరుపున ఒక నోడల్ అధికారిని నియమించాలని, శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సభ లోపలితో పాటుగా, పరిసరాలలో కూడా శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే చర్చలు బాగా జరుగుతాయని, గౌరవ సభ్యులుసమయానికి సజావుగా శాసనసభకు చేరుకోవడానికి రహదారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు స్పీకర్ గడ్డం ప్రసాద్.అనంతరం.. కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రేపటి నుండి జరిగే సమావేశాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరుతున్నామని, జిల్లాల పర్యటనలో ప్రోటోకాల్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి, ఉల్లంఘన జరుగుతుందన్నారు. ప్రోటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, శాసనమండలి పరిసరాలలో చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు శాఖది అని ఆయన వ్యాఖ్యానించారు. పొరపాట్లు జరగకుండా , సభ సజావుగా జరిగే విధంగా సహకరించాలని, శాసన మండలి సమావేశాలు జరిగే సమయంలో అధికారులు తప్పక హాజరవ్వాలి. సమన్వయంతో రెండు సభలను సజావుగా నడిచేలా చూడాలన్నారు. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని, ప్రోటోకాల్ ఉల్లంఘన సంఘటనలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# అమానుషం.. మామ మొఖంపై చెప్పుతో కొట్టిన కోడలు..



**శాసనసభ / హైదరాబాద్ :** మానవత్వం మంటగలుస్తోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా వృద్ధులపై విచక్షణారహితంగా కొందరు దాడులు చేస్తున్నారు. ఆస్తుల కోసం కొందరు, భారమై మరికొందరు వృద్ధులపై దాడికి పాల్పడుతున్నారు.తాజాగా ఓ కోడలు తన మామను వృద్ధుడని కూడా చూడకుండా చెప్పుతో దాడి చేసింది. వీల్ చైర్ లో కూర్చున్న మామ వద్దకు పరుగున వచ్చిన కోడలు చెప్పుతో కొట్టింది. ఈ ఘటన నల్గొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. నవంబర్ 20వ తేదీ ఉదయం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ కెమెరాలో రికార్డయిన ఈ ఘటన వైరల్ అవుతోంది.నడవలేని స్థితిలో వీల్‌చైర్‌లో ఉన్న మామపై కోడలు విచక్షణా రహితంగా దాడి చేసి, దుర్భాషలాడిన ఘటన శెట్టిపాలెంలో సంచలనంగా మారింది. అంతటితో ఆగకుండా అక్కడే ఉన్న చెప్పు తీసుకుని మామ ముఖంపై పొట్టు పొట్టు కొట్టింది. కోడలు కాళ్లు పట్టుకున్న కనికరించ కుండా ముఖంపై చెప్పుతో దాడి చేస్తూనే ఉంది. అయితే అక్కడే ఉన్న పెంపుడు కుక్క ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేసింది. కుక్క అరుస్తున్నప్పటికీ కోడలు పట్టించుకోలేదు. పెద్దాయన అక్కడి నుంచి కదలలేక కన్నీరుమున్నీరుగా విలపించాడు. తన తలను కొట్టుకుంటూ ఏడుస్తూ వీల్‌ఛైర్ పైనే కన్నీరుపెట్టుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన వారు ఆ మూగ జీవికున్న మానవత్వం మనిషికి లేకుండా పోయిందంటూ కామెంట్లు చేస్తున్నారు. నడవలేని స్థితిలో వున్న ఆ పెద్దాయనపై చెప్పుతో కొట్టిన కోడలిని కఠినంగా శికించాలని డిమాండ్ చేస్తున్నారు.

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867
శాసనసభ తెలుగు దినపత్రిక
సోమవారం 09 డిసెంబర్ - 2024

## అన్ని వర్గాలకు ప్రాధాన్యత
## ఇస్తామన్న మహేశ్ కుమార్ గౌడ్..



శాసనసభ / హైదరాబాద్ : ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఇందుకోసం కార్యకర్తలు, నేతలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీ పదువులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలంటే.. గాంధీ భవన్ చుట్టూ తిరగకుండా.. ప్రజల మధ్య ఉండాలని సూచించారు. అంతే కాదు.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలన్నారు. కులగణన సర్వే ఆధారంగానే లోకల్ బాడీ ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలోనే లోకల్ బాడీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ పదవుల్లో, ఇతర నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా సామాజిక న్యాయం పాటిస్తుందని తేల్చి చెప్పారు. అన్ని సామాజిక వర్గాల వారికి, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 శాతం స్థానాలను గెలుచుకోవడమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తను త్వరలోనే నియోజకవర్గాల్లో పర్యటిస్తానని మహేశ్ గౌడ్ చెప్పారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సంక్రాంతి తర్వాత బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలైన యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళ కాంగ్రెస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఇతర అనుబంధ విభాగాలను కూడా త్వరలోనే ప్రక్షాళన చేస్తామన్నారు. అన్ని కులాలు, మతాలను గౌరవించడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాతమని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభి వృద్ధి లక్ష్యంగా రేవంత్, భట్టి, మంత్రులు పాలన చేస్తున్నారని కితాబు ఇచ్చారు. 2023 లో 22.9 శాతం నిరుద్యోగం ఉంటే 2024 లో దాని శాతం18.1 కి తగ్గుముఖం పట్టిందని గుర్తు చేశారు.

## తాజాగా తెలంగాణ తల్లి బొమ్మను ప్రొఫైల్
## పిక్ గా పెట్టుకున్న బీఆర్ఎస్



శాసనసభ / హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపడుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ తల్లి విగ్రహం ఫొటోను ఇటీవల విడుదల చేశారు. ఆ విగ్రహం కాస్త భిన్నంగా ఉండడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ తన ప్రొఫైల్ పిక్ ను మార్చింది. తెలంగాణ తల్లి విగ్రహం బొమ్మను ప్రొఫైల్ పిక్ గా పెట్టుకుంది. అయితే, ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ తల్లి బొమ్మకు, బీఆర్ఎస్ ప్రొఫైల్ పిక్ లోని తెలంగాణ తల్లి బొమ్మకు తేడా ఉంది. కాంగ్రెస్ బొమ్మలో విగ్రహానికి కిరీటం లేదు, బీఆర్ఎస్ బొమ్మలో తెలంగాణ తల్లికి కిరీటం ఉంది. అంతేకాదు, ముఖం కూడా మార్పు ఉంది.

## రేవంత్ ఏడాది పాలనపై చార్జిషీట్
## విడుదల చేసిన హరీశ్ రావు

రేవంత్ పాలన రైతుల సంక్షేమానికి రాహుకాలం అని, వ్యవసాయానికి గ్రహణం అని అభివర్ణించారు. అధికారంలోకి రాగానే రుణమాఫీపై మొదటి సంతకం పెడతానని హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక హామీని నిలుపుకోలేదని ఆరోపించారు. కనిపించిన దేవుడి మీదల్లా ఒట్లు పెట్టి నాలుగు కోట్ల ప్రజలను మోసం చేయగలిగినోడికి... మూడు కోట్ల దేవతలను మోసం చేయడం పెద్ద విషయమా? అని హరీశ్ రావు విమర్శించారు. "బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎంత ధాన్యం పండిందన్నది దాచినా దాగని సత్యం. 2014-15లో 68 లక్షల టన్నుల వరి పండితే... 2023-24లో 1.68 కోట్ల మెట్రిక్ టన్నుల వరి పండింది. 2014-15లో 1.31 కోట్ల ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం... 2023-24 నాటికి 2.22 కోట్ల ఎకరాలకు పెరిగింది. ఇదంతా ఎవరి వల్ల సాధ్యమైందో రేవంత్ రెడ్డి చెప్పాలి" అని నిలదీశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రోడ్డెక్కని రంగం అంటూ లేదని, విద్యార్థుల నుంచి అవ్వా తాత వరకు అన్ని వర్గాల వారిని రోడ్ల మీదికి తెచ్చిన గొప్పదనం రేవంత్ ప్రభుత్వానికే దక్కుతుందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి దావోస్ కు వెళ్లి అక్కడ కూడా తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నాడని, ఆయన మాట్లాడిన భాషకు అర్థం ఏమిటో ఆ దేవుడికే తెలియాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

## విగ్రహావిష్కరణకు రాలేను.. మంత్రి పొన్నంకు
## సెంట్రల్ మినిస్టర్ కిషన్ రెడ్డి లేఖ..

తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు లేఖ రాశారు. తను సోమవారం నిర్వహించనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాలేనని పేర్కొన్నారు. ముందస్తు కార్యక్రమాలు, పార్లమెంటు సమావేశాల ఉండడంతో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాలేకపోతున్నట్లుగా వివరించారు. తెలంగాణ తల్లి విగ్రహం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, ప్రత్యేక గుర్తింపు, పోరాటానికి ప్రతీకగా అని పేర్కొన్నారు. విగ్రహ ఆవిష్కరణకు తనను ఆవిష్కరించినందుకు ధన్యవాదాలు చెప్పారు. కాగా ఈ కార్యక్రమానికి మాజీ సీఎం రావడంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ కార్యక్రమానికి ఆయన వెళ్లకపోవచ్చని తెలుస్తోంది. కాగా తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ట్యాంక్‌బండ్ ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విగ్రహావిష్కరణ తర్వాత జరిగే పబ్లిక్ మీటింగ్‌లో సీఎం మాట్లాడుతారు. విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారని అందరూ భావించారు. కానీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మహిళల చేతులు మీదుగా ఆవిష్కరింపజేయాలని సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ వర్గాలకు చెందిన మహిళలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపినట్లు సమాచారం. కాగా ఈ కార్యక్రమానికి కు ఏఐసీసీ నుంచి ఎవరు వస్తారనేది తెలియరాలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో సోనియాగాంధీ హైదరాబాద్ కు వచ్చే అవకాశం లేదు. రాహుల్ లేదా ప్రియాంకాగాంధీలో ఎవరో ఒకరు వస్తారని భావించారు.

# మహిళలకు తులం బంగారం..
## ఎప్పటి నుంచి,,మంత్రి శ్రీధర్ బాబు క్లారిటీ



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తయిపోయింది. కాగా..ఎన్నికల్లో ఇచ్చిన హామీలను.. ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. అయితే.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా..మహిళలకు పెద్దపీట వేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. ముందుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించి ఇచ్చిన మాటను నిలబెట్టుకుం ది. అయితే.. ఆ తర్వాత రైతులకు ఇచ్చిన మాటలను నెరవేర్చే పనిలో బిజీ అయిపోయింది. ఈ క్రమంలో.. మహిళలు ఇచ్చిన తులం బంగారం,ఒక్కొక్కరికి రూ.2500, చదువుకునే యువతులకు స్కూటీలు లాంటి చాలా హామీలు ఇప్పటికీ అమల్లోకి రాకపోవటం.. పలు విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా..కళ్యాణలక్ష్మీ లబ్దిదారులకు తులం బంగారం విషయంలో.. ప్రజలు కాస్త అసహనంగా ఉన్నారు. తులం బంగారం ఎప్పుడెప్పుడు ఇస్తారా అని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే.. ఇదే విషయంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు క్లారిటీ ఇచ్చారు. ప్రజా పాలన.. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా.. ఓ ప్రముఖ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోందన్నారు. కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం లాంటి హామీల అమలు కాస్త సమయం పడుతుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మంత్రి వ్యాఖ్యలతో.. తులం బంగారం ఇప్పట్లో ఇచ్చేది లేదని.. తెలంగాణ ప్రజలు ఇంకాస్త సమయం వేచి చూడాల్సిందేనని అర్థమవుతోంది. ఇదిలా ఉంటే.. తాను సైలెంట్ కిల్లర్‌ను కాదు.. చురుకైన కాంగ్రెస్ కార్యకర్తనంటూ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే.. నిరుద్యోగ యువత బాధను అర్థం చేసుకుని.. ఏకంగా 55 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేస్తున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడు ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు.. రైతులందరికీ రెండు లక్షల మేర రుణమాఫీ చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండో రోజే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేశామన్నారు. ఈ పథకంతో రోజూ లక్షల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి గ్యారంటీని అమలు చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న హామీల అమలుకు కూడా కసరత్తు జరుగుతోందనని చెప్పుకొచ్చారు. ఇందులో భాగంగానే.. రేషన్ కార్డు లబ్ధిదారులకు జనవరిలో సంక్రాంతి పండుగ నుంచి సన్నం బియ్యం ఇచ్చే ఆలోచనలో ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## రేషన్ కార్డు దారులకు శుభవార్త చెప్పిన ప్రభుత్వం..!



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు శుభవార్త చెప్పింది. త్వరలోనే రేషనా కార్డు ఉన్న వారికి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అన్ని రంగాల్లో రాష్ట్రాని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సంవత్సర కాలంగా అన్ని రంగాలను ఆదుకునే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని గుర్తు చేశారు. అయినప్పటికీ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఫాక్స్‌కాన్ పెట్టుబడుల అంశంలో కేటీఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నట్లు పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ ఇప్పటికీ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ప్రతిపక్షాల ఆలోచనలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. హైడ్రా కేవలం అక్రమార్కుల ఆట కట్టించడానికేనని చెప్పారు. పేదవారి ఇళ్లను హైడ్రా ముట్టుకోదని చెప్పారు. హైడ్రా ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పేదలు మురికి కూపాల్లో ఉండాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతల ఆలోచన అని ఆరోపించారు. అసలు మూసీ ప్రాజెక్టుకు, రాబర్ట్‌వాద్రాకు ఏంటి సంబంధం ఏంటని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ 3వ సారి గెలిచినా తెలంగాణకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. బీజేపీ మెప్పు కోసమే తమపై కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని.. ప్రపంచ నగరాల సరసన హైదరాబాద్ ను నిలబెడతామని చెప్పారు. గత పదేళ్లలో చిన్నాభిన్నమైన తెలంగాణ ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. గత అప్పులకు 10 నెలల్లో రూ.50వేల కోట్ల వడ్డీ కట్టామని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రైతు రుణ మాఫీ, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే దిశగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చినాం. ఇంకా మనం మాట్లాడకుంటే మంచిదికాదు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసనసభ పక్ష సమావేశం ఆదివారం మధ్యాహ్నం ఎర్రవల్లి నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సోమవారం నుండి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉభయ సభల్లో పార్టీ సభ్యులు అనుసరించాల్సిన వ్యూహం పై అధినేత కేసీఆర్ చర్చించారు. పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణ పై పార్టీ సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అసెంబ్లీ లో మండలిలో నిలదీయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సమస్యలపై చర్చించిన కేసీఆర్, సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి, మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా గొంతు విప్పాలని వివరించారు. ఎన్నికల సంధర్బంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను అణచివేస్తున్నదని దుయ్యబట్టారు. లగచర్ల లో మెడికల్ ఫ్యాక్టరీ పేర తమ భూములు గుంజుకుంటున్నారని రొడ్లమీదికి వచ్చిన గిరిజనుల మీద ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తున్నదని, ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల నివాసాలను కూలగొడుతున్నదని, ఇది ఎంతమాత్రం క్షమించరానిదన్నారు. హైడ్రా ముసుగులో పేదల ఆవాసాలను బుల్డోజర్లతో నిలువునా కూల్చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఉభయ సభల్లో ఎండగట్టాలన్నారు. ఇంకా పలు కీలక అంశాల పై అనుసరించాల్సిన వ్యూహాలను సభ్యులకు అధినేత వివరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ. " రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చినాం. ఇంకా మనం మాట్లాడకుంటే మంచిదికాదు. ప్రజలు కూడా వూరుకోరు. లేనిపోని ఆశలు కల్పించి ప్రజలను నిలువునా మోసం చేసి ఇప్పుడు ప్రశ్నించినోల్లనే రాష్ట్ర ప్రభుత్వం పగబడుతున్నది. తనను నమ్మి వోట్లేసిన నిరుపేదలను రైతులను గిరిజనులను దళితులను నిర్ధాక్షిణ్యంగా వేధిస్తున్నది. ఇదేంది అని అడిగిన వాల్లను కేసులు పెట్టి వేధిస్తున్నది. ప్రజల పక్షాన పోరాడుతున్న బిఆర్ఎస్ నేతలను శ్రేణుల మీద వూ.. అంటే కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నది. త్యాగాలు చేసి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను తెర్లు చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి. ప్రభుత్వం మీద ఇప్పటికే ప్రజలకు విసుగు పుడుతోంది. అన్నవస్త్రాలకని పోతే వున్న వస్త్రాలు వూసిపోయినట్టయిందని ప్రజలు దు:ఖ పడుతున్నారు." అని తెలిపారు. దళితులను బీసీలను ఏ ఒక్కరినీ వదలకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతివొక్క వర్గాన్ని వంచిస్తున్నదన్నారు. కామారెడ్డి బిసీ డిక్లరేషన్ ఏమయిందాన్నారు. సాగునీటి రంగాన్ని అస్తవ్యస్తం చేసిన రాష్ట్ర ప్రభుత్వం తన చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకోవడానికి నాటి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదునాం చేసేందుకు కాళేశ్వరం అంశాన్ని ముందుకు తెచ్చినారన్నారు. వృథాగా సముద్రంలో కలుస్తున్నకాళేశ్వరం జలాలను ఎందుకు ఎత్తిపోస్తలేరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగుల పరిస్థితి కూడా దారుణంగా తయారయ్యిందని కేసీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ%ో% " మన ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే అత్యంత ఎక్కువ జీతాలు తీసుకున్న ఉద్యోగులుగా చరిత్రకెక్కారు. పదేండ్ల కాలంలో వారి జీతాలను 73 శాతం పెంచినాం.

( మొదటి పేజీ తరువాయి )

## స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి 750కోట్లు నిధులు సీఎం కేటాయించారు

నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యం కాంగ్రెస్ పార్టీ లో చేరిన తర్వాత పార్ల ఎన్నికల్లో కావ్యాకు టికెట్ ఇచ్చారని, నన్ను కావ్యను సోషల్ మీడియాలో ఇష్టం ఉన్నట్లు దూషించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి 750కోట్లు నిధులు సీఎం కేటాయించారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి. లీడర్ అనే నాయకుడు గ్రామాల్లో ఉంటూ గ్రామ సమస్యలు తెలుసుకొని గ్రామ స్థాయిలో ఉంటేనే టికెట్.. లేదంటే..నన్ను కలిసిన ప్రయోజనం ఉండదని, బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీని ప్రభుత్వాన్ని 6అబద్ధాలు, 66మోసాలు, 100రోజుల పాలనా అంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విదంగా రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ కి దక్కింది. హరీష్ రావు కు సవాల్ చేస్తున్న రైతులకు రుణమాఫీ చేయలేదని చెప్పగలావా ? అని ఆయన ప్రశ్నించారు. సన్నాలు పండించిన పంటలకు 500బోనస్ ఇస్తుంది. ఒక సంవత్సరం లో 55వేలా ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీది, కేసీఆర్ కుటుంబంలో అందరికి ఉద్యోగం వచ్చింది. అధికారంలో వచ్చిన తరువాత వేలా కోట్ల రూపాయలు వెనుక వేసుకున్నారు. ధరణి, లిక్కర్ ,కాళేశ్వరం ప్రాజెక్టు లో దోసుకున్న డబ్బులు ఇంతఅంత కాదు. ఇంత అవినీతి చేసిన కల్వకుంట్ల కుటుంభం, వారు చేసిన వాటిని నేను స్వయంగా చూస్తే, ఇలాంటి వాటిలో నేను ఉండలేను అంటి కాంగ్రెస్ పార్టీ లో కి వచ్చాను. 2014లో మీ ఆస్తులు ఎంత ,అధికారం పోయిన తర్వాత మీ ఆస్తులు ఎంత, అందుకే కెటిర్ అంటాడు.. నేను జైలు కు వెళ్ళడానికి కూడా సిద్ధంగా ఉన్నాను అంటున్నాడు. అంటే తప్పు చేస్తేనే ఇలాంటి ప్రకటన లు చేస్తున్నావు. నా వద్దకు ఎవరు రారు..నా మీద ఏ పోలిస్ స్టేషన్ లో కేసు లేదు. బీజేపీ,బీఆర్ఎస్ రెండు పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. యూట్యూబ్ ఛానెల్ పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ పై అసత్య ప్రచారాలు చేస్తుంటే ,కాంగ్రెస్ కార్యకర్తలు అందించాలి.' అని కడియం శ్రీహరి అన్నారు.

## అంబరాన్నంటిన ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

విజయోత్సవ సంబరాల వేళ ఆదివారం సాయంత్రం విద్యుత్ కాంతులతో ట్యాంక్‌బండ్ ప్రాంతం నూతన శోభను సంతరించుకుంది. వీకెండ్ కావడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఫ్యామిలీ మెంబర్లతో సహా చేరుకున్నారు. డా. బీఆర్. అంబేడ్కర్ సచివాలయంతో సహా ఎన్టీఆర్‌గార్డెన్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద మూడు వేదికలను ఏర్పాటు చేశారు. ఆయా వేదికలపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

## రైతుల కోసం ధరణి కొత్త యాప్, కొత్త చట్టం

2004-2014 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చిందని మంత్రి పొంగులేటి అన్నారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014- 2023 మధ్య కాలంలో కేవలం 1.52 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మాత్రమే టెండర్లు పిలిచారన్నారు. గత ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని.. చేసి చూపించామని, ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపైనా భారాస రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. త్వరలోనే సర్వే వ్యవస్థను కూడా పటిష్ఠం చేస్తామని, ఇందుకోసం 1000 సర్వేయర్ల పోస్టులను భర్తీ చేస్తామని పొంగులేటి తెలిపారు.

## గురుకులాలపై సమీక్షించిన మంత్రి పొన్నం..

విద్యార్థుల కోసం ఇప్పటికే సొంత భవనాలు ఉన్న 21 గురుకుల పాఠశాలలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 4 సొసైటీ కార్యదర్శులలో తో కలిసి మెనోచార్టు ఫైనల్ చేసి ఆ మెనూలో మార్పులకు అనుగుణంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని కి అధిక ప్రాధాన్యత ఇస్తూ సరికొత్త మెనూను అతి త్వరలో విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వారికి అవసరమైన పోషక ఆహారాన్ని అందించడంపై శ్రద్ధ వహించాలన్నారు. అంతేకాకుండా..'విద్యార్థులలో ఎవరికైనా అనారోగ్యం ఉంటే వెంటనే వారికి చికిత్స అందించాలి . కల్చరల్ ఆక్టివిటీస్ కి పిల్లలలోని కోకరికులం ఆక్టివిటీస్ కి వారిలోని సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యా, ఆహారం నాణ్యత ప్రమాణాల కోసం మహాత్మ జ్యోతిబాపూలే లో టాస్క్ ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మెరిట్ గల విద్యార్థులను అభినందించాలి వారికి కావలసిన ప్రత్యేక అవసరాలు ఏమైనా ఉన్నా కానీ ఆర్సీవోలు దృష్టికి తీసుకువచ్చి వారిద్వారా సెక్రటరీ దృష్టికి తన దృష్టికి తీసుకురావాలి. రానున్న పబ్లిక్ ఎగ్జామ్స్ లో విద్యార్థులు మంచి రిజల్ట్స్ సాధించేలా ప్లాన్ అఫ్ యాక్షన్ రెడీ చేయాలి. వచ్చే పదవ తరగతి పరీక్షలలో ఎం జె పి విద్యార్థులు మంచి రిజల్ట్స్ సాధించేలా ఉపాధ్యాయుల కృషి చేయాలి. ఎవరైనా స్లో లెర్నర్స్ ఉంటే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి లో విద్య నైపుణ్యాలను పెంచడానికి కృషి చేయాలి. విద్యార్థులకు మంచి ఆహారం, వసతి సదుపాయాలు కల్పిస్తూ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. అధికారులు నిర్యక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## టీ ఫైబర్,మీ సేవ యాప్ సేవలు ప్రారంభం

తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పించే టీ ఫైబర్ సేవలను ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజా విజయోత్సవాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీ ఫైబర్ ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సేవలను పరిశీలించి మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. టీ ఫైబర్ ద్వారా సంగారెడ్డి జిల్లా శ్రీరాంపూర్ వాసులతో ఆయన మాట్లాడారు. మీ సేవ మొబైల్ యాప్‌ను కూడా మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇందులో కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులకు రుణమాఫీ, బోనస్ కోసం మొబైల్ అప్లికేషన్ ప్రారంభించినట్లు తెలిపారు మంత్రి శ్రీధర్ బాబు. ADex HDFC బ్యాంక్ రైతు రుణాలను రెండు రోజుల్లోనే పొందేలా యాప్ తీసుకువచ్చామన్నారు. మొబైల్‌లోనే మీ సేవ సర్వీసులు పొందేలా యాప్ రూప కల్పన చేశారు. మీ సేవలో మరో తొమ్మిది రకాల సర్వీసులను ప్రభుత్వం యాడ్ చేసినట్లు తెలిపారు. గ్యాప్ సర్టిఫికేట్.. సిటిజన్ నేమ్ చేంజ్ వంటి తొమ్మిది రకాల అంశాలను కొత్తగా అందుబాటులోకి తెచ్చామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఇన్ని రోజులు ఫిజికల్‌గా వెళ్లి తీసుకునే అంశాను ఇక నుంచి మీ సేవ యాప్ నుంచే పొందే అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. అన్ని విభాగాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి ముందుకు సాగించాలని పని చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. డ్రగ్స్ కట్టడికి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా మిత్రా యాప్ రూపొందించామని మంత్రి తెలిపారు. చిన్న, మధ్య తరగతి సంస్థలను ఎంకరేజ్ చేయాలని పదేళ్ల తర్వాత కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకువచ్చామని చెప్పారు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918